
## ఈ వారం కథ

# "అరే పోశాలు, ఈ చెప్పులు దొరింట్ల ఇచ్చుగుంట బడికి పోరా!" కొడుకు పోచయ్యతో చెప్పాడు భూమయ్య.

భూమయ్య మోచీ. నలుభై ఏళ్ళుంటాయి. పూర్వం చెప్పులు తయారుచేసేవాడు. ఇప్పుడు మానేశాడు. మానే శాడు అనే బదులు తక్కువ

# చెప్పులు

—జింబో



చేశాడు అంటే బాగుం టుందేమో. హైదరాబాద్ నుంచి చెప్పులు తెచ్చి అమ్ముతున్నాడు. కొందరికి మాత్రం చెప్పులు తయా రుచేసి ఇస్తూ వుంటాడు. చెప్పులు తయారు చేసి చేసి అతని చేతులు వాడాల్లాగా మారిపోయినవి. నాలుగెక రాల తరి పొలం. బజార్లో చెప్పల దుకాణం. ఇద్దరు బిడ్డలు. ఒక కొడుకు. తన కొడుకు తనలాగా మోచీ కాకుండా బాగా చదువుకో వాలని పోచయ్యని చదివిపి స్తున్నాడు.

పోచయ్యకి పదమూడు సంవత్సరా లుంటాయి. చురుకైన కళ్ళు. బక్క పల్చగావుంటాడు. ఎనిమిదివ తరగతి చదువుతున్నాడు. ఎవరికైనా ఎందుకు లొంగి వుండాలనే మనస్తత్వం. చదువులో బాగావే వున్నాడు. స్కూలుకి పోయే తొందరలో వున్నాడు. గూట్లో మంచి పుస్తకాలు తీసుకుంటూ తండ్రి మాట విని అతని వైపు చూశాడు. భూమయ్య చెప్పలని కాగితంలో చుట్టు వ్నాడు.

"ఏంది వాయన నేను స్కూలుకి పొయ్యేటప్పుడు పని చెప్పతవు. నువ్వు దుకాణమే పెట్టివి. అవసరం వున్న వాళ్ళు దుకాణానికి వచ్చి తీసు కొని పోరా? మనమెందుకు వాళ్ళం టికి పొయ్యి ఇవ్వాలి" ప్రశ్నించాడు తండ్రిని.

కొడుకు ప్రశ్నకి ఆశ్చర్యపోయాడు భూమయ్య. అప్పుడప్పుడు కొడుకు ప్రశ్నలు అతన్ని ఆశ్చర్యపరుస్తుంటాయి. ఆలోచింపచేస్తుంటాయి. కొడుకు ప్రశ్నలో నిజముంది. దుకాణానికి వచ్చి వాళ్ళు తీసుకపోవచ్చు. తన తండ్రి కాలం నుంచి వూళ్ళ దొరలం దరి ఇండ్లకు వెళ్ళి చెప్పలు ఇవ్వడం అల వాటైపోయింది. ఇవ్వకపోతే ఏమిటి? ఆలోచిస్తేనే భయిమేసింది.

"తొప్పలనే గదరా! ఈ చెప్పలు దొర ఇంట్లో ఇచ్చుకుంట పోరాదు" మళ్ళీ చెప్పాడు.

"యియ్యకపోతే ఏమైతది వాయిన.

నువ్వు అన్నిటికి బుగులు పడతవు" అన్నాడు పోచయ్య పుస్తకాలని చేతి లోకి తీసుకుంటూ.

"పోశాలూ! నాలుగక్షరాలు రాంగనే నువ్వు గిట్ల మాట్లాడుతున్నావుగానీ, నీకు తెలియదురా దొరల సంగతి. అన్నీ మనసుల పెట్టుకుంటర్రు. ఎక్కన్నో చూసి తొక్కుతారు. నా మాట విని ఇచ్చుకుంటపోరా! నువ్వియ్యపోతే దుకాణం బంద్‌చేసి నేనే ఇచ్చివస్తాను"

"ఏం జేస్తరు నాయినా?"

"ఏమైనా జేస్తరు. భూముల కాగితా లన్నీ గాళ్ళ దగ్గర వుంటాయి బిడ్డా. మన భూములల్ల ఎవలిదన్నా ఖబ్జా రాస్తే సరిపోదా! నీకివ్వన్ని సమజుగా దురా నా మాట విను" భూమయ్యకి లక్ష్మీనారాయణ గుర్తుకొచ్చాడు. అతని భూమి గుర్తుకొచ్చింది. అతను ఎట్లా భూమి నుంచి బయటకు నెట్టివేయబ డ్డాడో గుర్తొచ్చి భయమేసింది.

తండ్రి మాటలు పోచయ్యకి అర్థంకా లేదు. తండ్రి భయంలో ఏదో నిజముం దనిపించింది. ఏమీ మాట్లాడకుండా చెప్పుల్ని కుడి చేతిలోకి తీసుకొని, ఎడమ చేతిలో పుస్తకాలు పట్టుకొని బయటికి నడిచాడు.

పాముని కూడా చూసి భయపడని తండ్రి దొరకి అంత భయపడ్డం అత నికి ఆశ్చర్యం వేసింది. ఆలోచిస్తూ మూల మలుపు దాటి దొర ఇంటి వైపు దారి తీశాడు పోచయ్య. దొర ఇల్లు దాటే బడికి వెళ్ళాలి. దొర ఇంటి ముందు నుంచి వెళ్తున్నప్పుడల్లా అక్కడి వాతావరణం వింతగా అన్పిస్తుంది. దొర పేరు రాంకిషన్‌రావు. అతను పట్వారీ. అతని అన్న జగన్మోహనరావు. అతను పటేల్. వూరికి ఏ అధికారి వచ్చినా వాళ్ళింటికి వెళ్ళాల్సిందే. గిరిదావర్ నుంచి ఆర్డీవో వరకే, మోరీల్ సాబ్ నుంచి డియస్పీ దాక అందరూ అక్కడే మొకాం. సర్పంచ్ కూడా వాళ్ళ మనిషే. ఆలోచిస్తూ మెయిన్ రోడ్డు మీది కొచ్చాడు. పోచయ్య. తన క్లాస్ పిల్లలందరూ స్కూలుకి పోతున్నారు. చెప్పులిచ్చి స్కూలుకి వెళ్ళేసరికి రెండో బెల్ అయిపోతుందేమో. తండ్రి మీద. కోపమొచ్చింది పోచయ్యకి.

వూళ్ళో ముందటి పరిస్థితులు లేవు. హరిజనులు వెనకబడ్డ తరగతుల వాళ్ళు అందరూ చదువుకుంటున్నారు. అయినా వూరి మీద రాంకిషన్‌రావు కుటుంబం పట్టు ఇంకా పోలేదు.

దొర ఇంటి వద్దకొచ్చాడు పోచయ్య. ముందు పెద్ద పాటకు. లోపల ఇల్లు. ఇంటి ముందు గూర్ఖాల్లాగా ఇద్దరు సుంకర్లు కూర్చొని వున్నారు. బీడీలు కాలుస్తూ ఏదో ముచ్చట్లు పెట్టుకుం టున్నారు. పోచయ్య అక్కడికి వచ్చి కోర్టు ముందు ఖైదీలా నిల్చున్నాడు.

"ఏమిరా పిల్లగా ఎటో వచ్చినవు" అన్నాడు ఓ సుంకరి. బరిసె లాంటి ఆయుదం అతని పక్కన వున్నది.

"దొరకి చెప్పులు ఇయ్యమన్నడు మా అయ్య. అవి తెచ్చిన" సమాధానమి చ్చాడు పోచయ్య, చేతిలోని చెప్పులను చూపిస్తూ.

"వుండు. దొర ఏం జేస్తున్నడో చూసి వస్తా" లేస్తూ అన్నాడు సుంకరి.

"నువ్వు ఇచ్చెయ్యరాదు. నేను స్కూలుకి పోవాలే" చెప్పులు అతని కివ్వబోతూ పోచయ్య అన్నాడు.

"ఏమిరో పోరగా, నీకు పైత్యము వ్వట్టుంది దొరకి చెప్పులు ఇవ్వకుండనే పోతవా!, సదివిన వుతీ వుండుండు" అంటూ లోపలికి పోయిండు సుంకరి.


ఏం చెయ్యాలో తోచలేదు పోచ య్యకి. అట్లాగే నిల్చున్నాడు. లోప లికి వెళ్ళిన సుంకరి ఐదు నిముషాల తర్వాత వచ్చాడు.

"దొర పూజలున్నాడు, నిలబడు గొద్దిసేపు" పోచయ్యకి చెప్పాడు సుంకరి. పోచయ్య అట్లాగే నిల్చున్నాడు కాళ్ళు పీకుతున్నాయి. ఆ రోజు క్లాసు పోతుందని బాధగా వుంది. తండ్రి మీద, దొర మీదకోపమొచ్చింది. ఏమీ చెయ్యలేక అట్లాగే నిల్చున్నాడు.

○ చదివి వుంటే బాగుండేదని ప్రతి ఒక్కరూ అను కుంటూ, ఏ ఒక్కరూ చదవటానికి సిద్ధపడకపోతే ఆ గ్రంథం ఒక మహాకావ్యం లేక ఒక ప్రామాణిక గ్రంథం.

—మార్క్‌ట్వైన్.

# జాగింగ్ జోక్స్





## స్కూ .. గింగ్

*జాగింగ్‌లో వున్న జోగారావుని స్కూటర్ మీద పోతున్న సుబ్బారావు చూసి, స్కూటర్ ఆపి "లిఫ్ట్ ఇస్తాను రండి"... అన్నాడు.

"అబ్బే!... జాగింగ్ చేస్తాఉన్నా"...

"ఫర్వాలేదు. ఈ గతుకుల రోడ్డు మీద స్కూటర్ పైన వెళ్ళడమే, జాగింగ్ కంటె గొప్ప ఎక్సర్‌సైజ్" అన్నాడు సుబ్బారావు.




## జాగ్లింగ్


*రోజూ రవి తన పెంపుడు కుక్క జాలీతో సహా జాగింగ్ చేస్తుంటాడు. జాలీ తిన్నగా వుండక, నానా ఇబ్బంది పడుతూ వుంటుంది రవిని. దాన్ని చూసి ఓ మిత్రుడు "మీది జాగింగ్ కాదండి – జాగిలింపు" అని చమత్క రించాడు.




## రాగానందం

*రావుకి ఈ మధ్య 'ఫిట్‌నెస్' పిచ్చి బాగా పట్టింది. జిమ్‌కెళ్ళి బ్యాగ్రౌండ్‌లో పాప్ మ్యూజిక్ వస్తుంటే ఎక్సర్‌సై జులు చేయడం బాగా అలవాటైంది. ఓ రోజు అర్ధరాత్రి రావు బెడ్ రూంలోని టేప్ రికార్డర్ లోంచి రాప్ సంగీతం జోరుగా వినిపించడం మొదలెట్టింది. అసలే నిద్రపట్టక సతమతమవుతున్న రావు తండ్రి "ఏమిట్రా ఈ అర్ధరాత్రి మద్దెల దరువు" అంటూ కయ్యమని లేచాడు.

"ఇదో నెధవ సంత!... ఆ జిమ్ కెళ్ళిందగ్గర్నించీ ఈ పాడు మ్యూజిక్ లేందే మీకు 'మూడ్' రాకపోవడం కాదు గాని పరువు పోతోంది." రికార్డర్ పీక నొక్కుతూ కసిగా అంది భార్య.




## లంచ్ జాగ్

*"మొన్నటి వరకు నడుస్తుండే వాడివి, పరిగెత్తడం మొదలెట్టే వేం?" అడిగాడు కాంతారావు ఫణిని.

"ఈ మధ్య మా ఆవిడ పురిటికి పుట్టింటికి వెళ్ళింది. నా భోజనం మిలట్రీ హోటల్‌లో మరి..." అన్నారు ఫణి.


## రన్ – పన్

"మీ రచనా శైలి పరిగెత్తినట్టు వుంటుంది. ఎలా సాధించారు?" ఆరాధనగా అడిగాడు అభిమాని రచయితని.

"ఏం లేదు!... నా రచనలన్నీ నేను పొద్దుటి పూట రన్నింగ్ చేస్తున్నప్పుడే రూపు దిద్దుకుంటాయి నా మనసులో"

ఎస్.హనుమంత్రావ్

త్వరలో






అరగంట గడిచింది

"కొంచం చూసి రారాదు. నేను బడికి బోవాలే "సుంకరితో అన్నాడు పోచయ్య.

సుంకరి లోపలికి వెళ్ళి ఐదు నిముషాల తర్వాత వచ్చాడు. అతని వైపు ఆత్రుతగా చూశాడు పోచయ్య.

"రా!రా!పొల్లగా, దొర కచేరిల కొచ్చిండు" అంటూ లోపలికి దారి తీసిండు సుంకరి. అతని వెంట వడి చాడు పోచయ్య పుస్తకాలని చెప్పులని పట్టుకొని ఒక చేత్తో నిక్కరును సవరించుకున్నాడు. గుబులు గుబులుగా అన్పించింది. హోమ్ వర్క్ చేయన ప్పుడు కూడా అన్పించ లేదు.

పాటకు దాటి లోపలికి పోయినారు. వడగలాగా కన్పించింది లోపల బంగ్లా. పెద్ద దర్వాజా దాటి కచేరి దగ్గరికి పోయినారు. మడత కుర్చీలో కూర్చోని వున్నాడు రాంకిషన్ రావు. ముప్పై అయిదు దాటి వుంటాయి. మనిషి సాత్వికంగానే వున్నాడు.

"ఏంరా పోల్లగా మీ అయ్య రాలేదా? నీతోని పంపిండు" అన్నాడు దొర.

"రాలేదయ్యా"అంటూ చెప్పులు దొర కాళ్ళ దగ్గర పెట్టిండు పోచయ్య.

దొర కుర్చీ నుంచి లేచి చెప్పులు వేసుకున్నాడు అటూ ఇటూ వడిచి చూశాడు.

"కొంచం కుత్తెమైయివమిరా పొల్లగా తీస్కపోయి వొదలు చెయించుక రా"

పోచయ్య దొర దగ్గరి నుంచి చెప్పులు తీసుకున్నాడు.కాగితంలో చుట్టుకొని సుంకరితో పాటు బయటకి వచ్చాడు. బడికి పోలేదు. తండ్రి మీద కోప మొచ్చింది. చెప్పలతో బాటూ ఇంటి మొఖం పట్టాడు.

* * *

పది సంవత్సరాలు గడిచిపోయ్యాయి. ఈ పదేళ్ళ కాలంలో వూళ్ళలోకి అన్న లొచ్చిండు. రాంకిషన్‌రావు పట్వారీతనం పోయింది. దొరతనం పోయింది. ఆయన భూములన్నీ పడావు వడ్డాయి. అమ్ము కోవడానికి అవకాశం లేదు. వూళ్ళో వుండే పరిస్థితి అంత కన్నా లేదు. వూరు వదిలి కరీంనగర్ జేరిండు.

ఈ పదేళ్ళ కాలంలో పోచయ్య డిగ్రీ చదువై పోయింది. కాంపిటేటివ్ పరీక్షలు రాశాడు.ఎమ్మార్వో అయ్యాడు.

* * *

క్లాక్ టవర్ పక్కన ఓ పెద్ద చెప్పల షాప్. దాన్నిండా రకరకాల చెప్పలు. సాయంత్రం ఏడవుతుంది. రష్గా ముగ్గురు సేల్స్‌మెన్స్ కస్టమర్లకి హాజర వుతున్నా, ఇంకా కొంత మంది యజమానిని ఏదో అడుగుతున్నారు. అతను వచ్చి వాళ్ళకు చెప్పలు చూపిస్తున్నాడు. అవి నచ్చకపోతే వేరే మాడల్స్ చూపిస్తున్నాడు.

అప్పుడే పోచయ్య జీపులో క్లాక్ టవర్ వద్ద కొచ్చాడు చెప్పలు కొనుక్కోవడానికి రోడ్డు పక్కన జీప్ ఆపి షాపులోకి వచ్చాడు. ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. ఎవరో కస్టమర్‌కి చెప్పలు తొడుగుతున్న యజమాని పోచయ్యని గుర్తు పట్టి కౌంటర్ వద్దకి వెళ్ళి పోయాడు. పోచయ్య కూడా అతన్ని గుర్తు పట్టాడు. ఆశ్చర్యపోయాడు. అతను రాంకిషన్‌రావు! ఎలాంటి మనిషి ఎలా అయిపోయ్యాడు! అనుకున్నాడు.

పోచయ్య చెప్పలు సెలక్టు చేసుకొని కౌంటర్ దగ్గరకొచ్చాడు బిల్ కట్టడానికి.

"ఏం రా పోచయ్య ఇప్పుడు ఇక్కడే ఎమ్మార్వోగా పని చేస్తున్నావట కదా!" అన్నాడు రాంకిషన్‌రావు పోచయ్య దగ్గరి నుంచి డబ్బులు తీసుకుంటూ. రాంకిషన్‌రావు పలకరింపుతో పోచయ్య గుండె కలుక్కుమంది. తను రాగానే కస్టమర్‌కి చెప్పలు చూపిస్తున్న రాంకిషన్ రావు కౌంటర్ దగ్గరికి వెళ్ళి పోవడం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. అప్పటి వరకు మర్చిపోయిన తన కులం గుర్తుకు వచ్చింది పోచయ్యకి. వృత్తులు మారిపోయినవి. తమ వృత్తి రాంకిషన్ రావు చేస్తున్నాడు. అతని వృత్తి తను చేస్తున్నాడు. ముప్పై గ్రామాలకు తను అధికారి. అయినప్పటికీ రాంకిషన్‌రావు ప్రవర్తన తన పట్ల మారలేదు. అతని వృత్తి మారింది. ప్రవృత్తి మారలేదు. చెప్పలు తీసుకొని బయటకు వడిచాడు పోచయ్య. ●

○ మేధాశక్తికి అన్నీ బానిసలే, అందరూ బానిసలే.